

# లిటిల్ రాస్కెల్

## మల్లాది వెంకట కృష్ణమూర్తి

*(గత సంచిక తరువాయి)*

**"మీ కళ్ళముందే** ఈ ఏనుగు మాయమవుతుంది. జాగ్రత్తగా చూస్తూండండి."

రాజేష్ కళ్ళు ఆర్పకుండా నిలబడి చూస్తున్నాడు అదెలా మాయమవుతుందా అని.

"మీలో భయంలేని ఓ ఇరవైమంది ఎరీనామీదికి రావలసిందిగా కోరుతున్నాం."

"నువ్వెళతావా?" అడిగాడు దశరథరామయ్య రాజేష్ తన చేతిని పట్టుకుని లాగగానే.

"వెళదాం తాతయ్యా. అంతా వెళదాం. ఆ బఫూన్‌ని దగ్గరనించి చూడవచ్చు"

"మేమెందుకూ?" అడిగాడు సాంబశివరావు యిబ్బందిగా.

రాజేష్ అతని చేతిని పట్టుకుని లాగాడు.

"రండి నాన్నగారూ"

నలుగురూ ఎరీనా మీదకి వెళ్ళారు. అప్పటికే చాలామంది వచ్చారు.

"ఈ బోను చుట్టూ మీరు ఒకరి చేతులు మరొకరు పట్టుకుని నిలబడాలి" మైక్‌లో చెప్పారు.

బోనుకి నలువైపులా నల్లని తెరపడింది. అందరి దృష్టి ఏనుగుమీద కూర్చుని ఐస్‌ఫ్రూట్ తింటున్న ఆ బఫూన్ మీద పడింది.

ఓ సర్కస్ ఉద్యోగి ఎరీనామీద వున్న వాళ్ళందరినీ చేతులు పట్టుకోమని, తెరదింపబడ్డ ఏనుగున్న ఆ బోను చుట్టూ సర్కిల్‌గా నిలబెట్టాడు.

విచిత్రమైన వేషధారణగల ఓ వ్యక్తి బోను చుట్టూ తిరుగుతూ తెరమీద చేతిలోని ఎముకతో కొడుతూ "అబ్రకదబ్రా! అల్లాకాజం" అని గట్టిగా అరవసాగాడు. మూడుసార్లు అలా తిరిగాక, ఏనుగుమీద కూర్చుని వున్న బఫూన్ మీదకి విసిరాడు ఆ ఎముకని.

అది ఆ బఫూన్‌కి తగలగానే బోనులో పడ్డాడు బఫూన్. బోను కున్న నల్లటి తెర నెమ్మదిగా తెరుచుకుంది.

ఆశ్చర్యం.

బోనులో ఏనుగు లేదు. బఫూన్ ఒక్కడే బోనులో పరుగెత్తుతున్నాడు ఏనుగు కోసం వెదుకుతూ.

రాజేష్ చేతులు విడిపించుకుని ఆనందంగా చప్పట్లు కొట్టసాగాడు. వెంటనే సర్కస్ గుడారం అంతా చప్పట్లతో మారు మోగిపోయింది.

మళ్ళీ మ్యూజిక్ మొదలయింది. రాజేష్ ఎరీనాలో పిల్లిమొగ్గలు వేయసాగాడు ఉత్సాహంగా. నీరజ రాజేష్‌ని బలవంతంగా పట్టుకుని లాక్కొచ్చి కూర్చోపెట్టింది.

"అబ్రకదబ్రా.. అల్లాకాజం. ఈ 'గ్రేట్ ఇండియన్ సర్కస్' నాకెంతో నచ్చింది" చెప్పాడు వాడు ఎక్జయిటింగ్‌గా.

"మామయ్యగారూ రేపట్నించి మీరు వీడితో సర్కస్ ఆటలే ఆడాల్సి వస్తుంది" నవ్వుతూ చెప్పింది నీరజ.

సర్కస్ పూర్తయ్యాక బయటకు వచ్చారు. సర్కస్ జంతువులుండేచోటికి, బఫూన్‌ల దగ్గరకి వెళ్ళి వాళ్ళని చూస్తానని రాజేష్ ఒకటే గోల. నీరజ మరోసారి వాడిని సర్కస్‌కి తీసుకువస్తానని ప్రామిస్ చేసి దశరథరామయ్యతోపాటు ఆటో ఎక్కించింది.

"భలేవుంది తాతయ్యా ఈ సర్కస్. నాకు భలే నచ్చింది. ఆ పొడుగాటి బఫూన్‌లేడు, వాడు మిగతా బఫూన్‌లందరిచేతా బాగా తన్నులు తిన్నాడు. చేతిలో నీళ్ళ బాటిల్ పెట్టుకుని అందరిమీదా భలేపోశాడు నీళ్ళు. ఎలా నొక్కితే వస్తుంది నీరు? నాకలాంటి నీళ్ళ సీసా కొనిపెట్టనా?"

"తప్పకుండా."

"ఒకసారి ఆరు సాసర్లని గాల్లోకి ఎగరేస్తూ వాటిలో ఒకటి కూడా కిందపడకుండా ఎలా పట్టుకున్నాడో కదా?"

ఆ రాత్రి నిద్రపోయేదాకా రాజేష్ సర్కస్ గురించే మాట్లాడాడు.

తనో పెద్ద బఫూన్ అయి ఎరీనాలో రకరకాల ఫీట్స్ చేసి అందరినీ నవ్విస్తుంటే, ప్రేక్షకులంతా తనని చూసి చప్పట్లు కొడుతున్న కలలే ఆ రాత్రి రాజేష్‌కి కలలనిండా.

దూరంగా ప్రేక్షకులలో ఎవరో లేచి నిలబడ్డారు. కప్పులు ఎగరేసి పట్టుకుంటున్న రాజేష్ ఆవిడవంక చూశాడు. వెంటనే అతని చేతిలోని అన్ని కప్పులు నేలమీదపడి పగిలిపోయాయి.

"అమ్మా!" అరిచాడు రాజేష్ ఆవిడని గుర్తుపట్టి.

ఎరీనానుంచి దూకి తను అమ్మవైపు పరిగెత్తుకుంటే ప్రేక్షకులు పట్టుకుని ఆపుతున్నారు. బలవంతంగా వాళ్ళనించి విడిపించుకుని క్రిందపడుతూ లేస్తూ పరిగెత్తుతున్నాడు ఆమె వైపు. తనని ప్రేక్షకులు ఆపుతున్నకొద్దీ ఏడుపు తన్నుకువస్తోంది. కానీ అంతమందిలో ఏడవటం ఎలా?

నిద్రలో ఏడుస్తూ "అమ్మా! అమ్మా" అని కలవరిస్తున్న రాజేష్‌ని బాత్‌రూంలోంచి బయటకి వచ్చిన సాంబశివరావు లేపాడు.

"కలొచ్చిందా?" అడిగాడు అనునయంగా.

సాంబశివరావు అనుకున్నట్లుగా రాజేష్ లేచి బాత్‌రూంలోకి వెళ్ళలేదు.

"నాకిష్టం.. నాకిష్టం" గీత చదవలేదు. శ్రీరామ శ్రీరామ శ్రీరామ అనుకోలేదు. సాంబశివరావుని తన లేత చేతులతో చుట్టుకుపోయి వెక్కి వెక్కి ఏడవసాగాడు.

రాజేష్ తలని మృదువుగా నిమురుతూ "ఊర్కో ఊర్కో" అనటం తప్ప మరేం చేయలేకపోయాడు సాంబశివరావు కాసేపు.

"నాన్నా! అమ్మను తీసుకురావూ ఎక్కడికి వెళ్ళింది అమ్మ నన్ను యిలా వదిలేసి? నీకు తెలిస్తే పోనీ నన్ను అమ్మ దగ్గరకి తీసుకువెళ్ళవా నాన్నా! ప్లీజ్ ఒక్కసారి అమ్మను చూస్తాను. నాకు అమ్మకావాలి. నాకు అమ్మంటే ఇష్టం. నాకిష్టం...నాకిష్టం.. మా అమ్మంటే నాకి..."

ఏడుపు వాడి గొంతుకి అడ్డంపడి తగలడంతో ఆ తర్వాతి మాటలు బయటకు రాలేదు.

సాంబశివరావు రాజేష్ రెండు బుగ్గలు ముద్దుపెట్టుకుని వాడి వంటి మీద దుప్పటి కప్పి నిశ్శబ్దంగా తన గదిలోకి నడిచాడు.

అతని కళ్ళల్లో మసకమసగ్గా సన్నటి కన్నీటిపొర.

17

డాక్టర్ శశిభూషణ్ వచ్చేదాకా వెయిట్ చేశారు నీరజ, సాంబశివరావు, రాజేష్.

"ఏం నిర్ణయించారు?" అడిగాడాయన.

"మీ యిష్టం. మీకు ఏ రోజు వీలయితే ఆరోజు చేయండి" చెప్పాడు సాంబశివరావు.

"సికింద్రాబాద్ నర్సింగ్ హోమ్‌లో ఆపరేషన్ థియేటర్, బెడ్ ఖాళీగా వుండాలిగా?"

ఆయన రిసీవర్ అందుకుని ఆ నంబర్ తిప్పి మాట్లాడి చెప్పాడు.

"పదిహేడు తర్వాత చేద్దాం."

"అంటే ఎల్లుండేనా?"

"ఆపరేషన్ థియేటర్ ఖాళీగా వుంటే రేపే చేసేవాడిని. సూపర్ ది బెటర్. రేపు రాత్రి సికింద్రాబాద్ నర్సింగ్ హోమ్‌లో అడ్మిట్ చేయండి. మాట్లాడాను. నేను అక్కడికి వస్తాను. వచ్చేటప్పుడు ఎక్స్‌రేలు తీసుకురావడం మర్చిపోకండి."

ఆ రాత్రి రాజేష్ ఎంత బలవంతం చేసినా అన్నం తినలేదు. ఆకలి లేదని కొద్దిగా మజ్జిగ తాగాడు.

"నాకు ఆపరేషనా పిన్నీ?" అడిగాడు భయంగా.

"ఛ లేదు. ఎవరు చెప్పారు?"

"ఇందాక డాక్టర్ అన్నారుగా ఎల్లుండి చేస్తానని. దేనికీ ఆపరేషన్?"

"నీక్కాదు."

"మరెవరి గురించి ఆయన చెప్పింది?"

"ఇంకెవరో."

"మరి ఆ ఇంకెవరినో హాస్పిటల్‌కి తీసుకెళ్ళకుండా రేపు రాత్రికి నన్నెందుకు తీసుకెళుతున్నారు? మీరు అబద్ధం చెప్పకండి ఆంటీ. నిజంగానే కదూ ఆపరేషన్.

"అవును."

"నాకు వద్దు పిన్నీ నేను చేయించుకోను."

"ఏంకాదు. మేము వున్నాంగా?"

"ఊహూఁ వద్దు. నాకు భయం."

"నీకు మత్తుమందు యిస్తారు. అసలేం తెలియదు."

"అయినా వద్దు."

"ఏం చేస్తే ఆపరేషన్ చేయించుకుంటావు మరి?" రాజేష్ ఆశగా చూశారు.

"చెప్పు మరి?"

"అమ్మని తెస్తేనే. లేకపోతే పారిపోతాను" చెప్పాడు రాజేష్ స్థిరంగా.

నీరజకి ఆ సమాధానం భయాన్ని కలిగించింది.

"నీకిష్టం లేకపోతే వద్దులే" చెప్పింది.

అందరికన్నా ముందు పడుకున్న రాజేష్‌కి ఉదయం అయిదున్నరకి మెలుకువ వచ్చింది. తనంతట తనకి మెలుకువ రాలేదు. వంటిమీద స్పర్శాజ్ఞానానికి కళ్ళువిప్పి చూశాడు.

పొట్టమీద పాకుతోంది టింకూ.

"హలో టింకూ" ఆనందంగా అరిచి లేచి కూర్చున్నాడు. టింకూ అలవాటుగా రాజేష్ భుజం మీదకి పాకింది.

"ఎక్కడికెళ్ళావ్?" కోప్పడ్డాడు.

బదులుగా అది కిచకిచలాడింది.

"సరే అయితే. ఇంకోసారి ఇలా నాతో చెప్పకుండా వెళితే వూరుకునేది లేదు తెలుసా?" హెచ్చరించాడు.

ఉదయం నీరజ కాఫీ గ్లాసుతో వచ్చి దశరథరామయ్యకి అందించింది.

ఆయన దాన్ని అందుకుని చెప్పాడు.

"ఇవాళ నేనూ, రాజేష్ జూకి వెళ్ళొస్తాం."

"ఏం?" అడిగింది యధాలాపంగా. "వాడికి జంతువులంటే ఇష్టం కదా" ఇకముందు వాటిని చూసే అవకాశం వుండదేమో అనే వాక్యం ఆయన మాట్లాడకపోయినా, ఆయన ఆ వాక్యాన్ని ముగించిన తీరు వలన నీరజకి ఆ వాక్యం అలా పూర్తయి వుండేది అనిపించింది.

"గుడ్ ఐడియా. నేనూ వస్తాను. వారు బేంక్ మానేసి వస్తారేమో అడుగుతాను."

సాంబశివరావు వెంటనే వప్పుకున్నాడు.

"జూకా? అక్కడ సింహాలు, పులులు, జీబ్రాలు వుంటాయా? అయితే వెళదాం తాతయ్యా" చెప్పాడు ఉత్సాహంగా.

నీరజ పూరీలు, బంగాళాదుంపకూర, పెరుగన్నం, కొబ్బరన్నం అందులోకి పెరుగు, ఉల్లిపాయలతో చట్నీ చేసింది.

ఉదయం పదిన్నరకి నీరజ, సాంబశివరావు స్కూటర్ మీద, దశరథరామయ్య, రాజేష్, బన్ని ఆటోలో నెహ్రూ జూ పార్క్‌కి బయలుదేరారు.

దారిలో రాజేష్‌తో అంతకు ముందోసారి తను చూసిన జూపార్క్ విశేషాలని బన్ని వివరించసాగింది. రాజేష్‌లో సర్కస్‌కి వెళ్ళినప్పుడు ఎక్సయిట్‌మెంట్ కనబడింది దశరథరామయ్యకి.

దశరథరామయ్య ఆటో దిగేసరికి నీరజ, సాంబశివరావులు టిక్కెట్స్‌తో సిద్ధంగా వున్నారు పెద్దవాళ్ళ చేతులు పట్టుకుని పిల్లలు లోపలికి నడిచారు.

మొదటే వున్న చిన్నపిల్లల విభాగంలోని జారుడుబండ ఎక్కి జారి, ఆహ్లాదం చెందారు చిన్నపిల్లలిద్దరూ. తర్వాత లోపల తిరగసాగారు. అనేక రకాల కోతులు, జీబ్రాలు, తెల్లపులి, మామూలు పులులు, చిరుతపులులు, ఖడ్గమృగం, పంచరంగుల రామచిలుకలు, కుందేళ్ళు, తెల్లటి ఎలుకలు నెమళ్ళు, నక్కలు..

కాళ్ళు, చేతులు కడుక్కుని ఒంటిగంటంపావుకి ఓ చెట్టు నీడలో పరిచిన దుప్పటిమీద కూర్చున్నారు. నీరజ కేరియర్ తెరచి పేపర్ ప్లేట్స్‌లో పదార్థాలని సర్దింది.

"మా అమ్మా, నేనూ పిక్నిక్‌కి వెళితే కొబ్బరన్నం, పెసరట్లు, మజ్జిగ తెస్తుంది. మా అమ్మ పెసరట్లు బాగా చేస్తుంది. కొబ్బరన్నంలో ఇలా అప్పడాల ముక్కలు కలపదు మా అమ్మాయితే."

రెండు గంటలకి భోజనం అయింది. దగ్గరే వున్న పంపులోని నీళ్ళతో కేరియర్‌ని శుభ్రంగా కడిగింది నీరజ, చుట్టుపక్కల దాదాపు మరో పాతిక కుటుంబాలు కూర్చుని లంచ్ తీసుకుంటున్నారు.

"బన్నీ ఏ జంతువు ఎలా ఇంగ్లీషులో అరుస్తుందో నీకు తెలుసా?" అడిగాడు రాజేష్.

"జంతువులెక్కడన్నా ఇంగ్లీషులో అరుస్తాయిరా?" బన్ని నవ్వింది రాజేష్ నెత్తిమీద ఓ మొట్టికాయ వేసి.

"ఇంగ్లీషులో అరవడంకాదు. వాటి అరుపులని ఇంగ్లీషులో ఏమంటారో తెలుసా?" నాకిక్కొరుక్కున్నాడు.

"ఉహూ."

"నీకు తెలుసా?"

"తెలియదురా ఎప్పుడో చదువుకున్నాను కానీ మర్చిపోయాను."

"నీకు తెలిస్తే చెప్పు" చెప్పింది నీరజ పెద్దవాళ్ళకి వక్కపొడి అందిస్తూ.

రాజేష్ లేచి నిలబడి ఆ జంతువులని అనుకరిస్తూ పాటలా చెప్పసాగాడు.

"ఎలిఫెంట్స్ ట్రంపెట్
బట్ బేర్స్ థ్రిల్
కాక్స్ క్రో
వేర్ ఏజ్ డాగ్స్ బార్క్
షీప్ బ్లీట్
గీన్ గేగిల్ ఆర్ క్రేజిల్
వాట్ ఎబౌట్ ది హోర్సెస్?
ఎస్. హోర్సెస్ నై ఆర్ విన్నీ
ఏన్ ఎలిగేటర్ బెల్లోస్.
ఫాక్సెస్? హిప్. హి. హిప్.
విప్ మంక్స్? చిర్....చిర్...చిర్
మిల్క్ గివింగ్ కోస్ బాల్
నాట్ ఫర్ గెటింగ్ డాంకీస్ అండ్ పెంగ్విన్స్, దే బ్రే
ది స్మాల్ ఎల్క్ బగిల్స్
స్వీట్ స్క్విరల్స్ చేట్టర్
అండ్ ది కింగ్ ఆఫ్ ది జంగిల్, ది లయన్ రోర్స్."

చుట్టుపక్కలనించి దాదాపు పదిమంది పిల్లలు, నలుగురైదుగురు పెద్దవాళ్ళు వచ్చి నిలబడి రాజేష్ చెప్పేది ఆసక్తిగా వినసాగారు. అది పూర్తయ్యాక అడిగింది నీరజ

"మీ అమ్మ నేర్పించింది కదా యిది?"

"అవును... ఓసారి నేను లెక్కలు చేస్తుంటే ప్రోనౌన్సియేషన్‌లో తప్పు వచ్చింది. ఎవరెలా మాట్లాడాలో అలా మాట్లాడాలని చెప్పింది. అప్పుడు నేర్పించింది యిది."

"ఏం తప్పు చెప్పావూ?"

రాజేష్ సిగ్గుపడ్డాడు చెప్పడానికి.

బన్ని "చెప్పరా - చెప్పరా" అనడంతో చెప్పాడు.

"టు అండ్ టు

ది నన్ ఆఫ్ బిచ్ ఈజ్ ఫోర్

టు అండ్ త్రి

ది నన్ ఆఫ్ బిచ్ ఈజ్ సిక్స్

టు అండ్ ఫోర్

ది సన్ ఆఫ్ బిచ్ ఈజ్ ఎయిట్."

అది వినగానే పెద్దవాళ్ళందరి మొహాల్లో ఆశ్చర్యం చోటుచేసుకుంది.

"మా అమ్మ అలా అనకూడదని కోప్పడింది. నేను మా టీచర్ చెప్పింది తప్పుగా విని, అలా అలవాటు చేసుకున్నానన్నమాట. అసలు యిలా అనాలి."

"టు అండ్ టు

ది సమ్ ఆఫ్ విచ్ ఈజ్ ఫోర్.

టు అండ్ త్రి.

ది సమ్ ఆఫ్ విచ్ ఈజ్ సిక్స్

టు అండ్ ఫోర్

ది సమ్ ఆఫ్ విచ్ ఈజ్ ఎయిట్.

ఆఖరి గణితానికి బన్ని కూడా కోరస్ కలిపింది.

"అప్పుడు చెప్పింది అమ్మ మనుషులు భాషని స్పష్టంగా పలకాలని. జంతువులకి మనలాగా భాష వుండదుగా. వాటి అరుపులని ఇంగ్లీషులో ఏమంటారో నాకు త్వరగా రావాలని పాటలాగా ట్యూన్ కట్టిందన్నమాట. ఇందాక నే పాడిన ట్యూన్ అదే."

సాంబశివరావు కూడా నవ్వడు. 'ది సమ్ ఆఫ్ విచ్' అని.

"ఓ ఆట ఆడదామా?" అడిగాడు దశరథరామయ్య రాజేష్‌ని ఓరగా చూస్తూ.

"ఆడదాం తాతయ్య" రాజేష్ ఉత్సాహంగా లేచి నిలబడ్డాడు.

"ఏమాట ఆడదాం? ఇదివరకు ఆడినవేమీ వద్దు."

"బ్లయిండ్ మేన్స్ బ్లఫ్?" అడిగాడు రాజేష్.

"ఎలా ఆడతార్రా?" అడిగింది వుత్సాహంగా బన్ని కూడా లేచి నిలబడి.

రాజేష్ ఓ స్టీల్ స్పూన్ అందుకున్నాడు. ఎడంచేత్తో కళ్ళు మూసుకుని చెప్పాడు.

"కళ్ళకి గంతలు కట్టుకుని మధ్యలో నిలబడతాడు దొంగ. గుండ్రంగా చుట్టూ మీరు నిలబడతారు. దొంగ ఒన్ చెప్పగానే గుండ్రంగా అంతా కదులుతారు. టు చెప్పగానే ఎక్కడివాళ్ళు అక్కడ ఆగిపోతారు. దొంగ ఆ స్పూన్‌తో అందరి మొహాలు తడిమి ఎవరో చెప్పుకోగలగాలి. ఎవరయినా కరెక్ట్‌గా చెప్పుకోగలిగితే వాళ్ళు దొంగవుతారన్నమాట.

"పంటలు వేద్దాం పట్టండ్రా."

బన్ని, రాజేష్, నీరజ ఒకరి చేతులు మరొకరు పట్టుకుని గుండ్రంగా నిలబడి పంటలు వేశారు. రాజేష్ ఎడం చేతిమీద తన కుడి అరచేతిని బోర్లావేశాడు బన్ని, నీరజ మాత్రం తిరగేయడంతో రాజేష్ పండిపోయాడు. తరువాత సాంబశివరావు, మిగిలిన బన్ని, నీరజ వేశారు. బన్ని పండిపోయింది. దశరథరామయ్య, భార్యాభర్తలు వేశారు. సాంబశివరావు పండిపోయాడు. రాజేష్, మామా, కోడళ్ళు పంటలు వేశారు. దశరథరామయ్య దొంగయ్యాడు.

ఆయన కళ్ళకి తువ్వాలు కట్టుకుని చేతిలో స్పూన్‌తో నిలబడ్డాడు.

ఆయన చుట్టూ నిలబడ్డారు బన్ని, నీరజ, సాంబశివరావు. ఆయన ఒన్ చెప్పగానే చుట్టూ తిరగసాగారు. టూ చెప్పగానే ఆగారు.

దశరథరామయ్య చేతిలోని స్పూన్‌తో గాలిలో తడుతూ ముందుకు కదిలాడు. నీరజ దగ్గరకి వెళ్ళాడు. ప్రక్కనే నిలబడ్డ రాజేష్ నీరజకి మోకాళ్ళమీద వంగమని సౌంజ్ఞ చేశాడు. రెండడుగులు పొడవు తగ్గింది నీరజ.

ఆమె మొహాన్ని చెంచాతో తడిమి 'బన్ని' చెప్పాడు దశరథరామయ్య ఆమె ఎత్తునిబట్టి.

ఆ ఆట ఆడే విధం గ్రహించిన అయిదారుగురు తాము కూడా తమ కుటుంబసభ్యులతో సరదాగా 'బ్లయిండ్ మేన్స్ బ్లఫ్' ఆడుకోసాగారు.

దాదాపు పావుగంటదాకా ఆ ఆట ఆడారు.

"నీ లాగూ మళ్ళీ తడిసింది" చెప్పింది నీరజ రాజేష్‌తో.

దగ్గరేవున్న చెట్టుచాటుకి వెళ్ళాడు రాజేష్. వెనుతిరిగి వస్తూంటే చెట్లలోకి వచ్చిన సాంబశివరావు కనబడ్డాడు. దగ్గరకి వచ్చి అమాంతం హత్తుకుని రెండు చేతులతో తన గుండెలకి హత్తుకుని రాజేష్‌ని ముద్దులతో ముంచేశాడు.

ఆ హఠాత్ సంఘటనకి రాజేష్ బిత్తరపోయాడు.

"రేపు ఆపరేషన్‌లో నేను చచ్చిపోతానేమో? ఇప్పుడయినా నిజం చెప్పండి. మీరు మా డాడీయే కదూ? ఒకవేళ ఆపరేషన్‌లో బ్రతికిన మీరు మా డాడీ అని తర్వాత ఎవరితో చెప్పను. ఒట్టు."

తేరుకున్నాక సాంబశివరావు తలమీద చేతిని వేసి చెప్పాడు రాజేష్

"మే గాడ్ బ్లెస్‌యూ" చెప్పాడు సాంబశివరావు.

రాజేష్ వంగి సాంబశివరావు ముక్కుమీద తన పెదవులతో సున్నితంగా తాకి చెప్పాడు.

"చెప్పండి - నేను మీ అబ్బాయిని కదా?"

"వెళదాం పద."

ఇద్దరూ చెట్లలోంచి బయటికి వచ్చారు.

చెట్ల బయట నిలబడ్డ నీరజ రాజేష్ వంక చూసి నవ్వుతూ అడిగింది.

"ఎలా వున్నాయి మీ డాడీ ముద్దులు?"

సాంబశివరావు మొహంలో కత్తివాటుకు నెత్తురు చుక్కలేదు.

"రేపనేది మన చేతుల్లో లేదుకదా. కేవలం మానవత్వం, జాలి.." చెప్పాడు సాంబశివరావు.

"నిజమే. అవి మాకెవరికీ లేవు. మీ ఇద్దరిమధ్య ఒంటరితనం అప్పుడే అది వుంటుంది."

"అదికాదు..."

"ఇంకేం చెప్పకండి."

మూడుంపావుకి లయన్ సఫారి పార్క్‌కి బయల్దేరారు. స్వేచ్ఛగా తిరిగే సింహాలని చూడటానికి వెళుతున్నామని తెలియగానే బన్ని భయపడి రానని గొడవ చేసింది.

ఏం కాదని అంతా నచ్చచెప్పాక అయిష్టంగానే లయన్ సఫారి పార్కులోకి వెళ్ళే క్లోజ్డ్ మినీ వేన్ ఎక్కింది.

ముందర బయట గేటు తెరిచారు. వేన్ లోపలికి వెళ్ళాక బయట గేటు మూసి తర్వాత దాని ముందున్న లోపలి గేట్ తెరిచారు. వేన్ సఫారి పార్కులోకి వెళ్ళగానే ఆ గేట్ మూసేశారు. సింహాలు బయటకి రాకుండా జాగ్రత్తకోసం ఆ రెండు గేట్లు.

అడవిలా వున్న ఆ ప్రదేశంలో, చాలాసార్లు ఆ వేన్ తిరిగిన గుర్తుగా దారిలో గడ్డి మొలవకుండా వుంది. రెండు మూడు నిమిషాల్లో వేన్ ఒక చోట ఆగింది. వేన్‌కి కుడివైపునున్న చెట్టుకింద కూర్చునున్న సింహాలని చూపించాడు వేన్‌లో వచ్చిన గైడ్.

జూలుతో వున్న ఓ మొగసింహం, దాని ప్రక్కనే మూడు ఆడ సింహాలు బద్ధకంగా పడుకుని వున్నాయి. రాజేష్, బన్ని కళ్ళు ఇంతింత చేసుకుని చూసారు వాటివంక.

తను విన్న కొన్ని వందల కథల్లో ముఖ్యపాత్ర అయిన సింహాల వంక రాజేష్ కళ్ళార్పకుండా ఏదో మత్తు ఆవహించినట్లుగా చూసాడు వేన్ కదిలేదాకా.

తిరిగి బయటకు వచ్చేటప్పుడు మునుపటిలానే ముందర లోపలికి తెరచి, వేన్ ఆ గేటు దాటి వెళ్ళాక దాన్ని మూసి, తరువాత బయట తెరిచాడు వాచ్‌మేన్.

వేన్ దిగాక రాజేష్ చెప్పాడు.

"అబ్బ! ఎంత లావుగా వుందో. దాని కళ్ళల్లోకి చూస్తేనే భయం వేసింది."

"నాకేం భయం వేయలేదు."

*(కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments

**ప్రస్తుతం అందుబాటులో ఉన్న మల్లాదిగారి పుస్తకాల వివరాల కోసం ఇక్కడ క్లిక్ చేయండి**

www.anandbooks.com
www.telugubooks.in